ఆదిలాబాద్ వార్త



మంచిర్యాల, కొమురం భీం ఆసిఫాబాద్, నిర్మల్

శనివారం 22, ఆగస్టు 2026


# ఏసీబీ వలలో పంచాయతీ కార్యదర్శి

## 13వేలు లంచం తీసుకుంటూ పట్టుబడిన వైనం



**జన్నారం, ఆగస్టు 21, ప్రభాతవార్త:**

నూతన ఇంటి నిర్మాణ అనుమతి కోసం రూపాయలు 13000 లంచం తీసుకుంటున్న పంచాయతీ కార్యదర్శి ఏసీబీ అధికారులకు రెడ్ హ్యాండెడ్‌గా పట్టుబడ్డారు. ఏ సి బి దాడులు సంఘటన మండలంలో కలకలం రేపింది.వివరాలు ఇలా ఉన్నాయి. జన్నారం మండలం లింగయ్య పల్లె గ్రామ పంచాయతీ కార్యదర్శి వరలక్ష్మి అదే గ్రామానికి చెందిన తిరుపతి అనే వ్యక్తి నూతన ఇంటి నిర్మాణ అనుమతి కోసం పంచాయతీ కార్యాలయంలో దరఖాస్తు చేసుకోగా, అనుమతి ఇవ్వాలంటే రూపాయలు 15 వేలు లంచం డిమాండ్ చేసినట్లు సమాచారం. చివరకు 13వేలకు బేరం కుదరడంతో, శుక్రవారం రోజున నగదు మిగతా 2లో..

# పెండింగ్ భూసేకరణను వేగవంతంగా పూర్తి చేయాలి

✻ రూ.2,800 కోట్లు విడుదల చేసేందుకు సీఎం రేవంత్‌రెడ్డి ఆమోదం

✻ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి



**ఆదిలాబాద్, ఆగస్టు 21, ప్రభాతవార్త:**

రాష్ట్రంలోని నీటిపారుదల ప్రాజెక్టుల పనులు నిర్దేశిత గడువులోగా పూర్తయ్యేలా ప్రాజెక్టుల పరిధిలో పెండింగ్‌లో ఉన్న భూసేకరణ, పునరావాస పనులను వేగవంతం చేయాలని రాష్ట్ర నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్ రెడ్డి జిల్లా కలెక్టర్లను ఆదేశించారు. శుక్రవారం హైదరాబాద్ నుంచి అన్ని జిల్లాల కలెక్టర్లతో నీటిపారుదల ప్రాజెక్టుల భూసేకరణ అంశాలపై ఆయన వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించారు. కలెక్టరేట్ నుంచి జిల్లా కలెక్టర్ రాజర్షి షా ఈ వీసీలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ నీటిపారుదల ప్రాజెక్టుల నిర్మాణంలో భూసేకరణ ప్రక్రియ అత్యంత కీలకమని మిగతా 2లో..






# రూ.2 కోట్లకు పైగా మోసం...

✪ జిల్లా ఎస్పీని ఆశ్రయించిన బాధితులు

**ఆసిఫాబాద్, ఆగస్టు 21, ప్రభాతవార్త :**

జిల్లాలో రూ.2 కోట్లకు పైగా డబ్బుల మోసం జరిగిందంటూ పలువురు బాధితులు శుక్రవారం జిల్లా ఎస్పీ నీతికా పంత్‌ను ఆశ్రయించారు. అనంతరం అతడిపై చర్యలు తీసుకోవాలని వినతిపత్రం అందజేశారు. బాధితుల ఫిర్యాదు ప్రకారం ఆసిఫాబాద్ పట్టణంలో ఎలక్ట్రానిక్ మీడియాలో రిపోర్టర్‌గా పనిచేస్తున్న వ్యక్తికి 40 నుంచి 50 మంది చిట్టీలు, ఉద్యోగాలు ఇప్పిస్తానని చెప్పడంతో పాటు పలు సందర్భాల్లో డబ్బులు ఇచ్చినట్లు తెలిపారు. మొత్తం రూ.2 కోట్లకు పైగా నగదు తీసుకుని తిరిగి చెల్లించకుండా తమను మోసం చేశారని ఆరోపించారు. తమ డబ్బులు తిరిగి ఇవ్వాలని పలుమార్లు కోరినా స్పందించకపోవడంతో చివరకు న్యాయం కోసం జిల్లా ఎస్పీని ఆశ్రయించినట్లు బాధితులు తెలిపారు. ఈ మేరకు గురువారం జిల్లా ఎస్పీని కలిసి ఫిర్యాదు అందజేశారు. ఈ వ్యవహారంపై సమగ్ర విచారణ జరిపి ఆరోపణలు ఎదుర్కొంటున్న వ్యక్తిపై చట్టపరమైన చర్యలు తీసుకుని తమకు న్యాయం చేయాలని బాధితులు ఎస్పీని కోరారు. కాగా, ఈ ఆరోపణలపై పోలీసుల విచారణ అనంతరం పూర్తి వివరాలు వెలుగులోకి రావాల్సి ఉంది.

# గుడుంబాపై పోలీసుల ఉక్కుపాదం

✺ 10 లీటర్ల నిషేధిత గుడుంబా స్వాధీనం

✺ 3 వేల లీటర్ల బెల్లం పానకం ధ్వంసం.. ఒకరిపై కేసు నమోదు

**పెంచికల్‌పేట్, ఆగస్ట్ 21, ప్రభాతవార్త :**

కమ్యూనిటీ కాంటాక్ట్ ప్రోగ్రాంలో భాగంగా గ్రామాల్లో అనుమానస్పద ప్రాంతాలు, అక్రమ కార్యాకలాపాలపై తనిఖీలు నిర్వహిస్తున్నట్లు ఎస్సై అనిల్ కుమార్ తెలిపారు. శుక్రవారం చెడ్వాయి గ్రామంలో తనిఖీలు నిర్వహించగా 10 లీటర్ల నిషేధిత గుడుంబాతో పాటు, గుడుంబా తయారీకి సిద్ధంగా ఉంచిన 3వేల లీటర్ల బెల్లం పానకం ధ్వంసం చేసినట్లు తెలిపారు. ఈ ఘటనకు సంబంధించి ఒకరిపై కేసు నమోదు చేశామన్నారు. నిషేధిత గుడుంబా తయారీ, నిల్వ, రవాణా విక్రయాలకు పాల్పడే వారిపై చట్ట ప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్సై అనిల్ కుమార్ హెచ్చరించారు. గ్రామాల్లో అక్రమంగా గుడుంబా తయారు చేసిన, విక్రయించిన ప్రజలు మిగతా 2లో..



✤ జీవో నం. 97 రద్దు చేయాలని సీసీసీ కార్నర్‌లో రాస్తారోకో

✤ ఆందోళనకు సంఘీభావం తెలిపిన మాజీ ఎమ్మెల్యే నడిపెల్లి దివాకర్‌రావు



# పాలిటెక్నిక్ విద్యా వ్యవస్థను నిర్వీర్యం చేస్తే ఊరుకోం: బీఆర్‌ఎస్‌వీ

**నస్పూర్, ఆగస్టు 21, ప్రభాతవార్త**

పాలిటెక్నిక్ విద్యా వ్యవస్థను నిర్వీర్యం చేసే విధంగా కాంగ్రెస్ ప్రభుత్వం వ్యవహరిస్తోందని నిరసిస్తూ బీఆర్‌ఎస్‌వీ ఆధ్వర్యంలో నస్పూర్ సీసీసీ కార్నర్ రహదారిపై రాస్తారోకో నిర్వహించారు. బీఆర్‌ఎస్‌వీ మంచిర్యాల నియోజకవర్గ అధ్యక్షుడు దగ్గుల మధుకుమార్ ఆధ్వర్యంలో చేపట్టిన ఈ నిరసనలో జిల్లా అధ్యక్షుడు బడికల శ్రావణ్, ముఖ్య అతిథిగా మాజీ ఎమ్మెల్యే నడిపెల్లి దివాకర్‌రావు పాల్గొని విద్యార్థులకు సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ.. పదో తరగతి తర్వాత త్వరితగతిన ఉపాధినిచ్చే పాలిటెక్నిక్ కోర్సులను రద్దు చేసేందుకు ప్రభుత్వం జీవో నం. 97 తీసుకువచ్చిందని మండిపడ్డారు. స్కిల్ యూనివర్సిటీ పేరుతో ప్రైవేట్ వ్యక్తులకు మిగతా 2లో..

# కలశ్ వందన్ అభియాన్‌ను విజయవంతం చేయాలి

**- బీజేపీ ఎస్సీ మోర్చా జిల్లా అధ్యక్షుడు చిలుముల శ్రీకృష్ణ దేవరాయలు**

**బెల్లంపల్లి, ఆగస్టు 21, ప్రభాతవార్త**

బీజేపీ ఎస్సీ మోర్చా ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న కలశ్ వందన్ అభియాన్ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని బీజేపీ ఎస్సీ మోర్చా జిల్లా అధ్యక్షులు చిలుముల శ్రీకృష్ణ దేవరాయలు పిలుపునిచ్చారు. బెల్లంపల్లి పట్టణంలో ఏర్పాటు చేసిన విలేఖరుల సమావేశంలో మాజీ ఎమ్మెల్యే అమురాజుల శ్రీదేవితో కలిసి ఆయన మాట్లాడారు. సంత్ శిరోమణి రవిదాస్ మహారాజ్ 650వ జయంతిని పురస్కరించుకుని బీజేపీ ఎస్సీ మోర్చా దేశవ్యాప్తంగా ప్రత్యేక కార్యక్రమాలకు పిలుపునిచ్చిందన్నారు. సంత్ రవిదాస్ మహారాజ్ బోధనలు సమాజానికి మార్గదర్శకమని, కుల, వర్గ భేదాలకు అతీతంగా సమాజంలో ఐక్యత, సోదరభావం, సామరస్యాన్ని పెంపొందించడమే ఈ కార్యక్రమాల ప్రధాన ఉద్దేశమని తెలిపారు. రవిదాస్ మహారాజ్ చూపిన సమరసత మార్గాన్ని ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లాల్సిన అవసరం ఉందన్నారు. కాశీలోని సంత్ రవిదాస్ మహారాజ్ జన్మస్థలమైన సీర్ గోవర్ధన్‌పూర్ పవిత్ర క్షేత్రం నుంచి సేకరించిన మట్టితో పూజించిన పవిత్ర కలశాలను దేశంలోని అన్ని రాష్ట్రాలకు పంపినట్లు తెలిపారు. తెలంగాణకు చేరిన ఈ పవిత్ర కలశాన్ని రాష్ట్రంలోని 33 జిల్లాలకు తీసుకెళ్లి, ప్రతి ప్రాంతంలో సంత్ రవిదాస్ మహారాజ్ సందేశాన్ని ప్రజలకు చేరవేసేలా కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు చెప్పారు. ఈ నెల 23న హైదరాబాద్ నాంపల్లిలోని ఎగ్జిబిషన్ గ్రౌండ్స్‌లో తెలంగాణలోని 33 జిల్లాలకు పవిత్ర కలశాల పంపిణీ కార్యక్రమం నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమానికి కేంద్ర మంత్రులు, బీజేపీ జాతీయ, రాష్ట్ర నాయకులు, పార్టీ పదాధికారులు, హిందూ బంధువులు పెద్ద సంఖ్యలో హాజరుకానున్నట్లు పేర్కొన్నారు. మంచిర్యాల జిల్లా నుంచి బీజేపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, ప్రజలు, హిందూ బంధువులు పెద్ద సంఖ్యలో హైదరాబాద్‌కు తరలివచ్చి కలశ్ వందన్ అభియాన్ ను విజయవంతం చేయాలని వారు కోరారు. ఈ సమావేశంలో బీజేపీ పట్టణ అధ్యక్షురాలు దార కళ్యాణి, మండల అధ్యక్షులు దూడపాక భరత్ కుమార్, ఎస్సీ మోర్చా నాయకులు గోమాస కమల, చింతకింది లావణ్య, కల్లేపల్లి నవీన్, నర్సింగ్, రాము స్వామి, అనిల్, ప్రసన్న, మోహన్ తదితరులు పాల్గొన్నారు.



# గౌడ హక్కుల సాధనకు ఛలో వరంగల్

**- మోకుదెబ్బ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ కేసరి ఆంజనేయులు గౌడ్**

**కాగజ్‌నగర్ రూరల్, ఆగస్టు 21, ప్రభాతవార్త :**

గౌడ గీత కార్మికుల సమస్యలు, సంక్షేమం, హక్కుల సాధన కోసం ఈ నెల 23న చలో వరంగల్ కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు గౌడ జన హక్కుల పోరాట సమితి–మోకుదెబ్బ తెలంగాణ రాష్ట్ర కమిటీ తెలిపింది. ఆదివారం ఉదయం 11 గంటలకు వరంగల్ జిల్లా కేంద్రంలోని పోచమ్మ మైదాన్‌లో ఉన్న వరంగల్ హౌస్ మినీ ఫంక్షన్ హాల్‌లో రాష్ట్ర కమిటీ సమావేశం నిర్వహించనున్నట్లు మోకుదెబ్బ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ కేసరి ఆంజనేయులు గౌడ్ తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా గౌడ సమాజం ఎదుర్కొంటున్న సమస్యలు, గౌడ గీత కార్మికుల సంక్షేమం, ఉపాధి, భద్రత, పెన్షన్లు, నీరా పరిశ్రమ అభివృద్ధి తదితర అంశాలపై సమావేశంలో విస్తృతంగా చర్చించనున్నట్లు పేర్కొన్నారు. ముఖ్యంగా ఏజెన్సీ ప్రాంతాల్లో లైసెన్సుల పునరుద్ధరణ, టీసీఎస్, టీఎఫ్‌టీ లైసెన్సుల మంజూరు వంటి సమస్యలపై చర్చించి భవిష్యత్ కార్యాచరణ రూపొందించనున్నట్లు తెలిపారు. గత ఎన్నికల సమయంలో రాష్ట్ర ప్రభుత్వం గౌడ సమాజానికి ఇచ్చిన హామీల అమలు, ఇప్పటివరకు జరిగిన పురోగతి, తదుపరి చేపట్టాల్సిన కార్యాచరణపై సమావేశంలో చర్చించనున్నట్లు తెలిపారు. గీత కార్మికుల సంక్షేమం, సామాజిక న్యాయం, ఆర్థిక అభివృద్ధి, యువతకు ఉపాధి అవకాశాల కల్పన, నీరా పరిశ్రమ అభివృద్ధి, సంక్షేమ పథకాల అమలు వంటి అంశాలకు ప్రాధాన్యం ఇవ్వనున్నట్లు పేర్కొన్నారు. మోకుదెబ్బ సంస్థను రాష్ట్రవ్యాప్తంగా మరింత బలోపేతం చేయడంతోపాటు జిల్లాల వారీగా సంస్థాగత నిర్మాణాన్ని పటిష్ఠం చేయనున్నట్లు తెలిపారు. రాష్ట్ర నాయకులకు జిల్లాల ఇన్‌చార్జి బాధ్యతలు అప్పగించడం, గ్రామ, మండల, జిల్లా స్థాయిలో సంస్థాగత కార్యక్రమాలను విస్తరించడం తదితర అంశాలపై సమావేశంలో కీలక నిర్ణయాలు తీసుకోనున్నట్లు వెల్లడించారు. సమావేశానికి తెలంగాణ రాష్ట్రంలోని జాతీయ నాయకులు, రాష్ట్ర కమిటీ నాయకులు, అన్ని జిల్లాల అధ్యక్షులు, కార్యనిర్వాహక అధ్యక్షులు, ప్రధాన కార్యదర్శులు, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు, ఇతర ముఖ్య నాయకులు హాజరుకానున్నట్లు తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా ఉన్న మోకుదెబ్బ నాయకులు, జిల్లా అధ్యక్షులు, ప్రధాన కార్యదర్శులు, కార్యవర్గ సభ్యులు సమావేశానికి హాజరై తమ సూచనలు, అభిప్రాయాలను తెలియజేయాలని కేసరి ఆంజనేయులు గౌడ్ కోరారు.




# గుడుంబాపై పోలీసుల ఉక్కుపాదం

(మొదటిపేజీ తరువాయి)

వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని తెలిపారు. ప్రజల సహకారంతో గ్రామాల్లో నిషేధిత గుడుంబాని పూర్తిగా అరికట్టేందుకు చర్యలు కొనసాగిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో హెడ్ కానిస్టేబుల్ లక్ష్మణ్‌తో పాటు పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

## నేడు మందమర్రిలో

# న్యాయస్థాన భవనం ప్రారంభం

**- తెలంగాణ హైకోర్టు న్యాయమూర్తి భీమపాక నగేశ్**

**చేతుల మీదుగా ప్రారంభం**

**మందమర్రి, ఆగస్టు 21, ప్రభాతవార్త**

మందమర్రి పట్టణంలో నూతనంగా నిర్మించిన న్యాయస్థాన భవనం ప్రారంభోత్సవానికి ముస్తాబైంది. నేడు తెలంగాణ హైకోర్టు న్యాయమూర్తి భీమపాక నగేశ్ చేతుల మీదుగా నూతన న్యాయస్థాన భవనం ప్రారంభం చేస్తున్నారు. మందమర్రి ప్రాంత ప్రజలకు న్యాయ సేవలను మరింత చేరువ చేయడంతో పాటు కక్షిదారులకు సత్వర న్యాయం అందించాలన్న లక్ష్యంతో పట్టణంలో న్యాయస్థానం ఏర్పాటు చేయాలన్న ప్రయత్నాలు దాదాపు పన్నెండేళ్లుగా కొనసాగుతున్నాయి. ఎట్టకేలకు ఆ ప్రయత్నాలు ఫలించి మందమరి పట్టణంలోని సిఐఎస్ఎఫ్ బరాక్ ను సింగరేణి సంస్థ కేటాయించి ఇట్టి భవనాన్ని పూర్తిస్థాయిలో మరమ్మత్తులు పూర్తయి చేయించి న్యాయస్థాన భవన నిర్మాణంగా కేటాయించారు. నేడు భవనం ప్రారంభం కానుండటంతో స్థానికుల చిరకాల ఆకాంక్ష నెరవేరనుంది. మందమర్రిలో న్యాయస్థానం అందుబాటులోకి రావడంతో కేసుల విచారణ కోసం కక్షిదారులు, సాక్షులు, న్యాయవాదులు దూర ప్రాంతాలకు వెళ్లాల్సిన ఇబ్బందులు గణనీయంగా తగ్గనున్నాయి. సమయం, ప్రయాణ ఖర్చులు ఆదా కావడంతో పాటు న్యాయ ప్రక్రియలో పాల్గొనే వారికి మరింత సౌకర్యం కలగనుంది. మందమర్రితో పాటు సోమగూడెం, దేవాపూర్, రామకృష్ణాపూర్ మరియు చుట్టుపక్కల ప్రాంతాల ప్రజలకు నూతన న్యాయస్థానం ఎంతో ఉపయోగకరంగా మారనుంది. స్థానికంగానే న్యాయ సేవలు అందుబాటులోకి రావడంతో కేసుల విచారణకు హాజరుకావడం సులభతరం కానుంది. తద్వారా విచారణ ప్రక్రియ వేగవంతమయ్యే అవకాశం ఉంది.

## ఫలించిన 12 ఏళ్ల నిరీక్షణ

పట్టణంలో నూతన న్యాయస్థాన భవనం ప్రారంభోత్సవం నేపథ్యంలో నూతన న్యాయస్థాన భవనాన్ని మంచిర్యాల జిల్లా ప్రధాన న్యాయమూర్తి వీరయ్య పర్యవేక్షణలో కోర్టు అధికారులు, న్యాయవాదులు సర్వాంగ సుందరంగా ముస్తాబు చేశారు. నేడు జరిగే ప్రారంభోత్సవ కార్యక్రమానికి న్యాయశాఖ అధికారులు, న్యాయవాదులు, ప్రజాప్రతినిధులు, వివిధ వర్గాల ప్రముఖులు హాజరుకానున్నారు.

మందమర్రిలో న్యాయస్థానం ప్రారంభం కావడం ఈ ప్రాంత న్యాయ సేవల చరిత్రలో కీలక ఘట్టంగా నిలవనుంది. పన్నెండేళ్లుగా కొనసాగిన నిరీక్షణకు తెరపడటంతో స్థానికంగా హర్షాతిరేకాలు వ్యక్తమవుతున్నాయి.

# ఏసీబీ వలలో పంచాయతీ కార్యదర్శి

(మొదటిపేజీ తరువాయి)

తీసుకొని పంచాయతీ కార్యదర్శి వరలక్ష్మి వద్దకు వెళ్లగా, నగదు రూపకంగా వద్దని ఫోన్ పే రూపకంగా తన స్నేహితుల ఖాతా కు బదిలీ చేయాలని కండీషన్ పెట్టడంతో బాధితుడు తిరుపతి ఏసీబీని ఆశ్రయించాడు. ఈ క్రమంలో ఏసీబీ డీఎస్పీ మధు ఆధ్వర్యంలో అధికారులు పక్కా ప్రణాళికతో దాడి చేశారు. రూపాయలు 13 వేలు నగదు బదిలీ అయిన అనంతరం లింగయ్య పల్లి పంచాయతీ కార్యదర్శి వరలక్ష్మి అధికారులు అదుపులోకి తీసుకొని కేసు నమోదు చేశారు. ఈ సందర్భంగా ఏసీబీ డీఎస్పీ మధు మాట్లాడుతూ ఎవరైనా అధికారులు లంచం అడిగితే తమకు సమాచారం అందించాలని, వారి వివరాలు గోప్యంగా ఉంచుతామని తెలిపారు.

# పెండింగ్ భూసేకరణను వేగవంతంగా పూర్తి చేయాలి

(మొదటిపేజీ తరువాయి)

తెలిపారు. పెండింగ్ భూసేకరణ నిమిత్తం రూ. 2,800 కోట్లను విడుదల చేసేందుకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆమోదం తెలిపారని, నిధుల కొరత లేనందున కలెక్టర్లు ప్రత్యేక దృష్టి సారించి ప్రక్రియను త్వరితగతిన పూర్తి చేయాలని సూచించారు. ప్రాజెక్టుల ద్వారా కొత్త ఆయకట్టు సృష్టించడమే లక్ష్యంగా భూసేకరణ, పునరావాస పనులను సమాంతరంగా వేగవంతం చేయాలని ఆదేశించారు. నిర్వాసితులకు పునరావాస చర్యలను సకాలంలో పూర్తి చేస్తూ శాఖల మధ్య సమన్వయంతో పనిచేయాలని కలెక్టర్లకు సూచించారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో అదనపు కలెక్టర్ ఆర్. ఎస్ చిత్రు, ఆర్డీవో జగదీశ్వర్ రావు, సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.

# పాలిటెక్నిక్ విద్యా వ్యవస్థను నిర్వీర్యం చేస్తే ఊరుకోం: బీఆర్ఎస్‌వీ

(మొదటిపేజీ తరువాయి)

లబ్ధి చేకూర్చేందుకు పాలిటెక్నిక్ విద్యను నిర్వీర్యం చేస్తున్నారని, హక్కుల కోసం ప్రశ్నించిన విద్యార్థులపై పోలీసులను ప్రయోగించడం దుర్మార్గమని ఆగ్రహం వ్యక్తం చేశారు. వెంటనే జీవో నం. 97ను ఉపసంహరించుకోవాలని, లేనిపక్షంలో ఆందోళనలను మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్‌వీ నాయకులు నక్క తిరుపతి, ఎర్రోళ్ల నరేష్, ఎండీ నాయబ్, శ్రీకాంత్, బీఆర్ఎస్‌వై నియోజకవర్గ అధ్యక్షుడు కాటం రాజుకుమార్, నాయకులు ఎస్‌డీ జాకీర్, గోగార్ల శివ, కందుల ప్రశాంత్, సాజిద్, నస్పూర్ పట్టణ అధ్యక్షుడు ఆకూరి సుబ్బన్న, నాయకులు వంగ తిరుపతి, మెరుగు పవన్, కేతిరెడ్డి సురేందర్ రెడ్డి, కార్పొరేటర్ గుమ్మడి శ్రీనివాస్, పానుగంటి శ్రీను తదితరులతో పాటు పెద్ద సంఖ్యలో విద్యార్థులు పాల్గొన్నారు.

# కొత్త పింఛన్ల గురించి సమీక్ష సమావేశం

**లింగాపూర్, ఆగస్టు 21, ప్రభాతవార్త:**

లింగాపూర్ జై జగదాంబ మండల మహిళ సమైక్య కార్యాలయంలో ఐకెపి వివోఏ, టీజీఐఎల్పి కోచ్ , సీసీ లతో, కొత్త పింఛన్ల గురించి సమీక్ష సమావేశం నిర్వహించడం జరిగింది. అర్హత గల ప్రతి ఒక్కరు పింఛన్లు పొందే విధంగా అవగాహన కల్పించి దరఖాస్తు చేయించాలని తెలపడం జరిగింది. ఈ సమావేశంలో ఎంపీడీవో మాట్లాడుతూ ప్రతి ఒక్క అర్హత గల పింఛనుదారుడు దరఖాస్తు చేసే విధంగా గ్రామాలలో అవగాహన కల్పించి దరఖాస్తు చేసే విధంగా కృషి చేసేయాలని తెలపడం జరిగింది, వితంతు పెన్షన్ కోసం భర్త మరణ ధ్రువీకరణ పత్రం, ఒంటరి మహిళ పెన్షన్ కోసం విడాకుల పత్రం, వికలాంగుల పెన్షన్ కోసం వికలాంగ ధ్రువీకరణ పత్రం, కల్లుగీత కార్మికుల పెన్షన్ కోసం ఎక్సైజ్ శాఖ ధ్రువీకరణ పత్రం చేనేత కార్మికుల పెన్షన్ కోసం వస్త్ర శాఖ ధ్రువీకరణ పత్రం. ఫైలేరియా పెన్షన్ కోసం డీఎంహెచ్వో నమోదు ధ్రువికరణ పత్రం. డయల్సిస్ పెన్షన్ కోసం ఆరోగ్యశ్రీ ద్వారా చికిత్స పొందుతున్నట్లు ధ్రువీకరణ పత్రం. అలాగే దరఖాస్తు ఫారం, ఆధార్ కార్డు, కుల ధ్రువీకరణ పత్రం. ఆధార్ కార్డు. బ్యాంకు పాస్ బుక్ జిరాక్స్ తప్పనిసరిగా ఉండాలని తెల్పడం జరిగింది. ఈ కార్యక్రమంలో ఆర్ఐ ప్రదీప్ కుమార్, అసిస్టెంట్ ప్రాజెక్టు మేనేజర్ సూర్యకాంత్. బ్రాక్ మండల కోఆర్డినేటర్ రవికుమార్, కమ్యూనిటీ కోఆర్డినేటర్స్ కైలాస్, మీనా, స్వర్ణ, ప్రదీప్ , వివోఏ లు జాదవ్ బాబులాల్, జుగ్నక మారుతి, ఆడే బాలు తదితరులు పాల్గొన్నారు.







# ఘనంగా వరలక్ష్మీ వ్రత వేడుకలు

## భక్తిశ్రద్ధలతో పూజలు నిర్వహించిన మహిళలు

**మందమర్రి, ఆగస్టు 21, ప్రభాతవార్త**

మందమర్రి పట్టణంలో శ్రావణ మాస వరలక్ష్మీ వ్రత వేడుకలను మహిళలు శుక్రవారం భక్తిశ్రద్ధలతో ఘనంగా నిర్వహించారు. ఇళ్లలో, ఆలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించి వరలక్ష్మీదేవిని భక్తిశ్రద్ధలతో కొలిచారు. ఈ వేడుకల్లో మంచిర్యాల జిల్లా మాజీ జడ్పీ చైర్‌పర్సన్ నల్లాల భాగ్యలక్ష్మి పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. శ్రావణ మాసంలో పౌర్ణమికి ముందు వచ్చే శుక్రవారం రోజున వరలక్ష్మీ వ్రతాన్ని ఆచరించడం ఆనవాయితీగా వస్తోంది. కుటుంబంలో సుఖసంతోషాలు, సౌభాగ్యం, ఐశ్వర్యం, ఆరోగ్యం కలగాలని మహిళలు అమ్మవారిని ప్రార్థిస్తూ ప్రత్యేక పూజలు నిర్వహించారు. వరలక్ష్మీ వ్రతంలో భాగంగా అమ్మవారిని వివిధ రకాల పుష్పాలతో అలంకరించి, పసుపు, కుంకుమ, పండ్లు, పిండి వంటలు తదితర నైవేద్యాలను సమర్పించారు. పూజ అనంతరం ఇరుగుపొరుగు ముత్తైదువులను ఆహ్వానించి తాంబూలంతో పాటు అమ్మవారికి నివేదించిన ప్రసాదాలు, కానుకలను వాయినంగా ఇచ్చిపుచ్చుకున్నారు. వరలక్ష్మీ వ్రతం సందర్భంగా మహిళలు సంప్రదాయ దుస్తుల్లో ప్రత్యేకంగా అలంకరించుకుని పూజల్లో పాల్గొనడంతో పట్టణంలో ఆధ్యాత్మిక సందడి నెలకొంది. ఈ సందర్భంగా మహిళలు ఒకరికొకరు వాయినాలు ఇచ్చుకుంటూ శ్రావణ మాస పర్వదినాన్ని ఆనందోత్సాహాలతో జరుపుకున్నారు.

## కోటపల్లి గిరిజన బాలికల ఆశ్రమ పాఠశాలలో..

**కోటపల్లి, ఆగస్టు 21,ప్రభాతవార్త:**

కోటపల్లి గిరిజన బాలికల ఆశ్రమ పాఠశాలలో శుక్రవారం వరలక్ష్మీ వ్రతాన్ని భక్తిశ్రద్ధలతో, సంప్రదాయబద్ధంగా ఘనంగా నిర్వహించారు. పాఠశాల వార్డెన్ భవాని ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో వరలక్ష్మీ అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించి, పుష్పాలతో సుందరంగా ముస్తాబు చేసి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు సంప్రదాయ వస్త్రధారణలో పాల్గొని భక్తి భావంతో పూజా కార్యక్రమాలను నిర్వహించారు. వరలక్ష్మీ వ్రతం విశిష్టత, మహిళల జీవితంలో ఈ వ్రతానికి ఉన్న ఆధ్యాత్మిక ప్రాధాన్యత, కుటుంబ సౌభాగ్యం, ఐశ్వర్యం, శ్రేయస్సు కోసం ఈ పూజను నిర్వహించే ఆనవాయితీ గురించి వార్డెన్ భవాని విద్యార్థులకు వివరించారు. భారతీయ సంస్కృతి, సంప్రదాయాలు, పండుగల వెనుక ఉన్న విలువలను భావితరాలకు అందించాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని ఆమె సూచించారు. పండుగలు కేవలం ఆచారాలకే పరిమితం కాకుండా ఐక్యత, పరస్పర గౌరవం, కుటుంబ విలువలను పెంపొందించే వేదికలుగా నిలుస్తాయని పేర్కొన్నారు. పూజా కార్యక్రమం అనంతరం విద్యార్థులు భక్తి గీతాలు ఆలపించి, అమ్మవారికి మంగళహారతులు సమర్పించారు. కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, సిబ్బంది, విద్యార్థులు పెద్ద సంఖ్యలో పాల్గొని వరలక్ష్మీ అమ్మవారి ఆశీస్సులు పొందారు.

## నానో యూరియా
# వినియోగంపై అవగాహన

**వేమనపల్లి, ఆగస్టు 21, ప్రభాతవార్త**

పంటల్లో తెగుళ్లు, పురుగులను సమర్థవంతంగా నియంత్రించేందుకు రైతులు సమగ్ర సస్యరక్షణ పద్ధతులను అవలంబించాలని మండల వ్యవసాయ అధికారి రత్న సాయికృష్ణ రెడ్డి సూచించారు. వేమనపల్లి మండల కేంద్రంలోని శుక్రవారం ఆత్మ ఆధ్వర్యంలో అన్ని పంటల్లో సమగ్ర సస్యరక్షణపై రైతులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సాయికృష్ణ రెడ్డి మాట్లాడుతూ పంటల సాగులో అవసరానికి అనుగుణంగా మాత్రమే రసాయనిక మందులను వినియోగించాలని, పర్యావరణహిత సస్యరక్షణ పద్ధతులకు ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు. పంటలను ఎప్పటికప్పుడు పరిశీలిస్తూ తెగుళ్లు, పురుగుల ఉనికిని తొలిదశలోనే గుర్తించి తగిన చర్యలు తీసుకోవాలని తెలిపారు. వ్యవసాయ శాఖ అధికారులు సూచించిన విధంగా మందులు, ఎరువులను వినియోగిస్తే పెట్టుబడి వ్యయం తగ్గడంతో పాటు పంట దిగుబడి, నాణ్యత మెరుగుపడుతుందని వివరించారు. అనంతరం నానో యూరియా, నానో డీఏపీ వినియోగంపై రైతులకు క్షేత్రస్థాయి ప్రదర్శన నిర్వహించారు. వాటి వినియోగ విధానం, ప్రయోజనాలను రైతులకు వివరించారు. ఆధునిక వ్యవసాయ సాంకేతికతలను శాస్త్రీయ సూచనల మేరకు వినియోగించి అధిక దిగుబడులు సాధించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మాజీ జడ్పీటీసీ రుద్రబట్ల సంతోష్ కుమార్, మైనార్టీ మండల నాయకులు సయ్యద్ షాబీర్ అలీ, సర్పంచులు చెన్నూరి సమ్మయ్య, వుప్పులపు సాయికృష్ణ, కొట్రంగి శ్రీనివాస్, మడే శ్రీనివాస్, ఏనుగంటి మల్లీశ్వరి, ముల్కల్ల శ్రీలత, వ్యవసాయ విస్తరణ అధికారులు నిముష, మాలవిక, ఇతర రైతులు పాల్గొన్నారు.



## సింగరేణి హెల్త్ కార్డులపై
# ఎందుకు వ్యత్యాసం?

### - విప్లవ కార్మిక సంఘాల డిమాండ్

**బెల్లంపల్లి, ఆగస్టు 21, ప్రభాతవార్త**




సింగరేణి కార్మికులు, ఉద్యోగులు, వారి కుటుంబ సభ్యులకు మెరుగైన వైద్య సేవలు అందించాలనే ఉద్దేశంతో హెల్త్ కార్డు విధానాన్ని అమలు చేస్తున్నప్పటికీ, ఆ సేవల వినియోగంలో వ్యత్యాసాలు కనిపిస్తున్నాయని విప్లవ కార్మిక సంఘాలు ఆరోపించాయి. ఒకే సంస్థలో పనిచేస్తున్న ఉద్యోగులకు హెల్త్ కార్డు ఉన్నప్పటికీ, కొందరికి పూర్తి స్థాయి వైద్య సేవలు అందుతుండగా, మరికొందరికి చికిత్సలు, ఆసుపత్రుల ఎంపిక, నగదు రహిత వైద్యం తదితర అంశాల్లో ఇబ్బందులు ఎదురవుతున్నాయని పేర్కొన్నారు. ఒకే సంస్థలో పనిచేస్తున్న ఉద్యోగులకు హెల్త్ కార్డు సేవల్లో ఈ వ్యత్యాసాలు ఎందుకు వస్తున్నాయో సింగరేణి యాజమాన్యం స్పష్టత ఇవ్వాలని డిమాండ్ చేశారు. కార్డు కలిగిన ప్రతి అర్హుడైన ఉద్యోగి, పెన్షనర్, వారి కుటుంబ సభ్యులకు ఎలాంటి వివక్ష లేకుండా సమానమైన వైద్య సదుపాయాలు అందేలా చర్యలు తీసుకోవాలని కోరారు. ఆరోగ్య సేవల్లో అందరికీ సమాన హక్కు ఉండాలి, సింగరేణి హెల్త్ కార్డుల విషయంలో వ్యత్యాసాలకు స్వస్తి పలకాలి అంటూ కార్మిక వర్గం డిమాండ్ చేస్తోందన్నారు. ఇప్పటికైనా సింగరేణి యాజమాన్యం, సంబంధిత అధికారులు చొరవ తీసుకొని హెల్త్ కార్డుల సమస్యను పరిష్కరించాలని విప్లవ కార్మిక సంఘాలు డిమాండ్ చేశాయి. లేనిపక్షంలో చేపట్టబోయే ఆందోళన కార్యక్రమాలకు సింగరేణి యాజమాన్యం, ప్రభుత్వం బాధ్యత వహించాల్సి ఉంటుందని హెచ్చరించాయి. ఈ కార్యక్రమంలో టి.మణి రాంసింగ్ టిఎన్టియుసి రాష్ట్ర కార్యదర్శి, ఏఐఎఫ్టియు శ్రామిక శక్తి గోదావరి లోయ బొగ్గు గని కార్మిక సంఘం రాష్ట్ర కార్యదర్శి ఏం. పోచమల్లు, సింగరేణి గని కార్మిక సంఘం రాష్ట్ర నాయకులు అంబాల మహేందర్ తదితరులు పాల్గొన్నారు.

## అడెల్లి మహా పోచమ్మ ఆలయం వద్ద వేలంపాట వాయిదా

### - త్వరలోనే తదుపరి తేదీ ప్రకటిస్తామన్న అధికారులు

**సారంగాపూర్, ఆగస్టు 21, ప్రభాతవార్త:**

మండలంలోని అడెల్లి మహా పోచమ్మ ఆలయం వద్ద వివిధ రకాల విక్రయాలకు సంబంధించి శుక్రవారం నిర్వహించాల్సిన వేలంపాట తాత్కాలికంగా వాయిదా పడింది. పూర్వపు ప్రకటన ప్రకారం వేలంపాట నిర్వహణకు ఆలయ కార్యనిర్వహణాధికారి భూమయ్య ఏర్పాట్లు చేశారు. ఈ వేలంపాటకు దేవాదాయ శాఖ అధికారి రంగు రవికిషన్, ఆలయ మాజీ చైర్మన్లు, వ్యాపారులు, వేలంపాటదారులు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు. అయితే అనివార్య కారణాల వల్ల వేలంపాటను తాత్కాలికంగా వాయిదా వేస్తున్నట్లు కార్యనిర్వహణాధికారి భూమయ్య తెలిపారు. తదుపరి వేలంపాట నిర్వహించే తేదీని త్వరలోనే నిర్ణయించి వెల్లడిస్తామని చెప్పారు.



## ఎస్ఐఆర్ ప్రక్రియను పకడ్బందీగా పూర్తి చేయాలి

### - ఓటర్ల జాబితా సవరణ పారదర్శకంగా జరగాలి

### - జిల్లా కలెక్టర్ రాజర్షి షా

**ఆదిలాబాద్, ఆగస్టు 21, ప్రభాతవార్త:**

ఓటర్ల జాబితా సవరణ ప్రక్రియను ఎన్నికల నిబంధనలకు అనుగుణంగా పకడ్బందీగా, పారదర్శకంగా నిర్వహించాలని జిల్లా కలెక్టర్ రాజర్షి షా అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్ సమావేశ మందిరంలో వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులతో ప్రత్యేక సమగ్ర ఓటర్ల జాబితా సవరణ (ఎస్ఐఆర్) ప్రక్రియపై శుక్రవారం ఆయన సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. అర్హత కలిగిన ప్రతి ఒక్కరికీ ఓటు హక్కు కల్పించడమే ఎస్ఐఆర్ ప్రధాన ఉద్దేశమని పేర్కొన్నారు. డూప్లికేట్, చిరునామా మారిన ఓటర్ల వివరాలను పరిశీలించి జాబితాను పకడ్బందీగా రూపొందిస్తున్నామన్నారు. ఫారం6 ద్వారా కొత్త ఓటర్ల నమోదు, మార్పులకు సెప్టెంబర్ 16 వరకు దరఖాస్తులు స్వీకరిస్తామని, సెప్టెంబర్ 20 వరకు క్లెయిమ్స్, నోటీసుల ప్రక్రియ కొనసాగుతుందని వివరించారు. జాబితా శుద్ధీకరణకు రాజకీయ పార్టీల ప్రతినిధులు, బీఎల్‌ఏలు క్షేత్రస్థాయిలో సహకరించాలని కోరారు. ఈ సమావేశంలో డీఆర్‌వో స్రవంతి, ఆర్డీఓ జగదీశ్వర్ రావు, తహసీల్దార్ శ్రీనివాస్, ఎన్నికల విభాగం సూపరింటెండెంట్ నలందప్రియ, వివిధ పార్టీల నాయకులు పాల్గొన్నారు.

## ఘనంగా సూదులమ్మ విగ్రహ ప్రతిష్టాపన

**భైంసా, ఆగస్టు 21, ప్రభాతవార్త:**

బాసర మండల పరిధిలోని మైలాపూర్ గ్రామంలో సూదులమ్మ విగ్రహ ప్రతిష్టాపన మహోత్సవాన్ని శుక్రవారం ఘనంగా నిర్వహించారు. వేద పండితుల మంత్రోచ్చారణల నడుమ లలితా సహస్ర చండీ హోమం, రుద్రాభిషేకం, కుంకుమార్చన పూజలు శ్రద్ధాభక్తులతో చేపట్టారు. అనంతరం నూతన విగ్రహాలకు జలాభిషేకం నిర్వహించి మారెమ్మ ఆలయంలో ప్రతిష్టించారు. భజనలు, భక్తి పాటలు, వేద మంత్రాలతో గ్రామంలో ఆధ్యాత్మిక వాతావరణం నెలకొంది. ఈ సందర్భంగా మాజీ సర్పంచ్ మమ్మై రమేష్ కుమారుడు సచిన్ భక్తులకు, గ్రామస్తులకు ఉచిత అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేశారు. వివిధ గ్రామాల నుంచి వచ్చిన ప్రజలు, బంధువులు కులమతాలకు అతీతంగా పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు. ఆకుల నాగరాజు, మైస గంగన్న, బాధోళ్ళ శంకర్, తుప్పు పీరాజిల కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో మైలాపూర్ మాజీ సర్పంచ్ పోతగంటి సతీష్ రావు, రమేష్, లక్ష్మణరావు, బాసర సర్పంచ్ తీగల వెంకటేష్ గౌడ్, వీడీసీ చైర్మన్ నూకం లింగారావు, లిఫ్ట్ ఇరిగేషన్ అధ్యక్షుడు పువ్వుల రాజేశ్వర్, బీజేపీ మండల అధ్యక్షుడు పుట్నాల సాయినాథ్ పటేల్, తదితరులు పాల్గొన్నారు.



## రాష్ట్ర హైకోర్టు న్యాయమూర్తిని మర్యాదపూర్వకంగా కలిసిన జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్

**నస్పూర్, ఆగస్టు 21, ప్రభాతవార్త**



ఈ నెల 22వ తేదీన జిల్లాలోని మందమర్రి, బెల్లంపల్లి పట్టణాలలో కోర్టు భవనాల ప్రారంభోత్సవం సందర్భంగా శుక్రవారం జిల్లాకు విచ్చేసిన రాష్ట్ర హైకోర్టు న్యాయమూర్తి, జిల్లా పరిపాలన న్యాయమూర్తి నగేష్ భీమపాకను మంచిర్యాల జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ జిల్లాలోని జైపూర్‌లో గల ఎస్‌టిపిపి అతిథి గృహంలో జిల్లా ప్రధాన న్యాయమూర్తి ఎ.వీరయ్యతో మర్యాదపూర్వకంగా కలిసి మొక్కను అందజేశారు.



## రైతుల గోడు...రహదారి బాగు

**పెంచికల్ పేట్, ఆగస్ట్ 21, ప్రభాతవార్త :**

మండలంలోని పొతేపల్లి గ్రామ రైతుల విజ్ఞప్తికి స్పందించిన సర్పంచ్ దుర్గం పోషన్న శుక్రవారం రహదారి మరమ్మతు పనులకు శ్రీకారం చుట్టారు. గ్రామం నుంచి స్మశానవాటిక వరకు వ్యవసాయ పనులకు వెళ్లే రహదారి గుంతలమయంగా మారడంతో రైతులు ఇబ్బందులు పడుతున్నారు. దీంతో గ్రామసభలో రహదారి మరమ్మతులు చేపట్టాలని కోరగా రైతులతో కలిసి కొబ్బరికాయ కొట్టి పనులను ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ చిన్నయ్య, రైతులు పాల్గొన్నారు.

## జిల్లా గ్రంథాలయంలో అదనపు గదుల నిర్మాణానికి చర్యలు చేపట్టాలి

**ఆసిఫాబాద్, ఆగష్టు 21, ప్రభాతవార్త :**

ఆసిఫాబాద్ పట్టణంలోని జిల్లా గ్రంథాలయంలో అదనపు గదుల నిర్మాణానికి చర్యలు చేపట్టాలని కోరుతూ ఏఐఎస్ఎఫ్ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో జిల్లా గ్రంథాలయ అధికారులకు వినతిపత్రం అందజేశారు. శుక్రవారం కలెక్టరేట్ ఆవరణలో నిరుద్యోగులు విద్యార్థుల డిమాండ్లు పరిష్కరించాలని కోరుతూ నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ జిల్లా కేంద్రంలో గ్రంథాలయానికి పాఠకుల సంఖ్య అధికంగా ఉన్నప్పటికీ వారికి అనుగుణంగా సరైన సదుపాయాలు లేకపోవడంతో విద్యార్థులు, పోటీ పరీక్షలకు సిద్ధమవుతున్న అభ్యర్థులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. నూతనంగా నిర్మించిన గ్రంథాలయంలో చదువుకునేందుకు సరిపడా స్థలం, మౌలిక వసతులు లేకపోవడంతో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ నేపథ్యంలో నూతన గ్రంథాలయంలో పాఠకుల కోసం ప్రత్యేకంగా మరిన్ని గదులు, పోటీ పరీక్షలకు సిద్ధమవుతున్న అభ్యర్థులకు అవసరమైన వసతులు కల్పించాలని అదేవిధంగా గ్రంథాలయాన్ని మరింత అభివృద్ధి చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ జిల్లా నాయకులు జమీర్, రాహుల్, నవీన్, రాజేశ్, పవన్, సాయికృష్ణ, తదితరులు పాల్గొన్నారు.



నిరసన వ్యక్తం చేస్తున్న నిరుద్యోగులు, విద్యార్థులు

# ఇంటింటికీ ఇందిరమ్మ కుట్టు మిషన్‌కు దరఖాస్తుల ఆహ్వానం

- అర్హులైన బీసీ నిరుద్యోగ మహిళలు సెప్టెంబర్ 13లోగా దరఖాస్తు చేసుకోవాలి

- జిల్లా వెనుకబడిన తరగతుల అభివృద్ధి అధికారి నీరటి రాజేశ్వరి

**మంచిర్యాల జిల్లా ప్రతినిధి, ఆగస్టు 21, ప్రభాతవార్త**



జిల్లాలోని వెనుకబడిన తరగతుల కులాలకు చెందిన నిరుద్యోగ మహిళలకు ఉపాధి అవకాశాలు కల్పించే లక్ష్యంతో ఇంటింటా ఇందిరమ్మ కుట్టు మిషన్ పంపిణీ పథకం కింద ఆటోమేటిక్ కుట్టు మిషన్లను 100 శాతం రాయితీతో అందించనున్నట్లు జిల్లా వెనుకబడిన తరగతుల అభివృద్ధి అధికారి నీరటి రాజేశ్వరి ఒక ప్రకటనలో తెలిపారు. అర్హులైన అభ్యర్థులు సెప్టెంబర్ 13వ తేదీలోగా ప్రభుత్వ వెబ్‌సైట్ టీజీవోబిఎంఎంఎస్.సిజిజి.జిఓవి.ఐ ఎన్ ద్వారా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ఈ పథకానికి దరఖాస్తు చేసుకునే మహిళల వయస్సు 18 నుంచి 55 సంవత్సరాల మధ్య ఉండాలని తెలిపారు. నిరుద్యోగ మహిళలు, పేదలు, నిరాదరణకు గురైన వితంతువులు, ఒంటరి మహిళలు, వికలాంగులు, అనాథ మహిళలకు, అలాగే టైలరింగ్ శిక్షణ సర్టిఫికేట్ కలిగిన వారికి ప్రాధాన్యత ఇవ్వనున్నట్లు పేర్కొన్నారు. అభ్యర్థులు తెల్ల రేషన్ కార్డు లేదా ఆహార భద్రత కార్డు కలిగి ఉండటంతో పాటు, కనీసం 5వ తరగతి ఉత్తీర్ణులై ఉండాలని తెలిపారు. ఆధార్ కార్డు, కుల ధృవీకరణ పత్రం, ఆదాయ ధృవీకరణ పత్రం తప్పనిసరిగా ఉండాలని పేర్కొన్నారు. కుటుంబ వార్షిక ఆదాయం గ్రామీణ ప్రాంతాల్లో రూ.1.50 లక్షల లోపు, పట్టణ ప్రాంతాల్లో రూ.2 లక్షల లోపు ఉండాలని తెలిపారు. 2023-24 సంవత్సరంలో బీసీ ఒకేషనల్ స్కీమ్ స్వయం ఉపాధి పథకం కింద ఆర్థిక లబ్ధి పొందిన వారు ఈ పథకానికి అనర్హులు అని స్పష్టం చేశారు. ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసిన అనంతరం దరఖాస్తు ప్రతిని డౌన్‌లోడ్ చేసుకొని, సంబంధిత కుల, ఆదాయ, నివాస ధృవీకరణ పత్రాలు, ఆధార్ కార్డు, రేషన్ కార్డు, విద్యార్హతలు, టైలరింగ్ శిక్షణ లేదా అనుభవ ధృవీకరణ పత్రాలు తదితర పత్రాలతో సమర్పించాలని తెలిపారు. గ్రామీణ ప్రాంతాలకు చెందిన అభ్యర్థులు సంబంధిత మండల పరిషత్ అభివృద్ధి అధికారి కార్యాలయంలో, పట్టణ ప్రాంతాలకు చెందిన వారు సంబంధిత మున్సిపల్ కార్యాలయంలో సెప్టెంబర్ 13వ తేదీలోగా దరఖాస్తులు సమర్పించాలని సూచించారు. ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసి, దాని ప్రతిని సంబంధిత అధికారికి సమర్పించని పక్షంలో ఆ దరఖాస్తును పరిగణనలోకి తీసుకోబోమని జిల్లా వెనుకబడిన తరగతుల అభివృద్ధి అధికారి నీరటి రాజేశ్వరి స్పష్టం చేశారు.



## స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ ప్రారంభం

**ఆసిఫాబాద్ టౌన్, ఆగస్టు 21, ప్రభాతవార్త:**

కొమురం భీం ఆసిఫాబాద్ జిల్లా వ్యాప్తంగా స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ కార్యక్రమం కొనసాగుతోంది. శుక్రవారం పట్టణంలోని ఆయా ప్రాంతాల్లో సంబంధిత రేషన్ డీలర్ల ద్వారా లబ్ధిదారులకు స్మార్ట్ రేషన్ కార్డులను పంపిణీ చేశారు. జిల్లా కేంద్రంలోని ఆరవ వార్డులో మాజీ మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్, కౌన్సిలర్ చిలివేరి వెంకటేశ్వర్ రేషన్ డీలర్ రావుల రంగన్నతో కలిసి లబ్ధిదారులకు స్మార్ట్ రేషన్ కార్డులను అందజేశారు. ఈ సందర్భంగా పలువురు లబ్ధిదారులు తమ స్మార్ట్ రేషన్ కార్డులను స్వీకరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రభుత్వం ప్రజలకు మరింత సౌకర్యవంతంగా రేషన్ సేవలు అందించాలనే ఉద్దేశంతో స్మార్ట్ రేషన్ కార్డులను పంపిణీ చేస్తున్నట్లు తెలిపారు. అర్హులైన లబ్ధిదారులు తమకు కేటాయించిన సంబంధిత రేషన్ డీలర్లను సంప్రదించి స్మార్ట్ రేషన్ కార్డులను తీసుకోవాలని కోరారు. స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ ప్రక్రియను సక్రమంగా నిర్వహించి, అర్హులైన ప్రతి లబ్ధిదారునికి కార్డు అందేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో సంబంధిత అధికారులు, రేషన్ డీలర్ రావుల రంగన్న, లబ్ధిదారులు తదితరులు పాల్గొన్నారు.



## నందిగామ్‌లో పారిశుద్ధ్య పనులు

**పెంచికల్ పేట్, ఆగస్ట్ 21, ప్రభాతవార్త :**

కమ్మర్‌గాం పంచాయతీ పరిధిలోని నందిగాంలో 6వ వార్డు సభ్యుడు ఆలం బానయ్య ఆధ్వర్యంలో శుక్రవారం పారిశుద్ధ్య పనులు చేపట్టారు. బావి, మిషన్ భగీరథ నీటి ట్యాంకును బ్లీచింగ్ పౌడర్‌తో శుభ్రం చేశారు. వర్షాకాలంలో నీరు నిల్వ ఉండకుండా పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని పంచాయతీ కార్యదర్శి గణేష్ సూచించారు. కార్యక్రమంలో మాడె ముత్తక్క, గణేష్, మడుప శ్రీనివాస్, సిడాం భాస్కర్, మడుప తిరుపతి తదితరులు పాల్గొన్నారు.

## పురుగుల మందు తాగి వ్యక్తి ఆత్మహత్య

**హాజీపూర్, ఆగస్టు 21, ప్రభాతవార్త**

అప్పుల బాధ భరించలేక టీకానపల్లి గ్రామానికి చెందిన బూర్ల బానయ్య (45) పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకున్నట్లు హాజీపూర్ ఎస్సై కిరణ్ కుమార్ తెలిపారు. ఎస్సై తెలిపిన వివరాల ప్రకారం... టీకానపల్లి గ్రామానికి చెందిన బానయ్యకు సుమారు 20 ఏళ్ల క్రితం అమృతతో వివాహమైంది. వీరికి పిల్లలు కలగకపోవడంతో బానయ్య కొంతకాలంగా తీవ్ర మనస్తాపానికి గురవుతున్నాడు. దీనికితోడు ఇటీవల కొత్తగా ఇల్లు నిర్మించుకోవడంతో దాదాపు రూ.10 లక్షల వరకు అప్పులయ్యాయి. సంతానం కలగలేదనే బాధతో పాటు అప్పులు తీర్చే మార్గం కనిపించక తీవ్ర మనోవేదనకు గురైన ఆయన, జీవితంపై విరక్తి చెంది గురువారం సాయంత్రం ఇంట్లో ఎవరూ లేని సమయంలో మోనోక్రోటోఫాస్ పురుగుల మందు తాగాడు. గమనించిన కుటుంబ సభ్యులు స్పందించేలోపే మృతిచెందాడు. మృతుడి భార్య బూర్ల అమృత ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

## సరస్వతి శిశు మందిర్‌లో ఘనంగా సామూహిక వరలక్ష్మీ వ్రతం

**కాగజ్‌నగర్ రూరల్, ఆగస్టు 21, ప్రభాతవార్త :**

కాగజ్‌నగర్ ద్వారకానగర్‌లోని శ్రీ సరస్వతి శిశు మందిర్ ఇంగ్లీష్ మీడియం పాఠశాలలో శుక్రవారం సామూహిక వరలక్ష్మీ వ్రతాన్ని భక్తిశ్రద్ధలతో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రాంగణంలో ప్రత్యేక పూజా కార్యక్రమాలను ఏర్పాటు చేశారు. పూజా కార్యక్రమంలో సలహా సమితి సంయోజకులు, ప్రబంధకారిణి సభ్యురాలు దాసరి వెంకటేష్-నాగరాణి దంపతులు పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. వరలక్ష్మీ వ్రతం సందర్భంగా మహిళలు భక్తిశ్రద్ధలతో పూజలు చేసి అమ్మవారిని దర్శించుకున్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షురాలు డాక్టర్ కొత్తపెల్లి అనిత, ప్రబంధకారిణి కార్యదర్శి కోడిప్యాక సత్యనారాయణ, జిల్లా సభ్యులు గొల్లపల్లి భారతి, మాతృ మండలి సభ్యులు, హితైషులు, సమాజ బాంధవులు, మాతలు, పోషకులు, పూర్వ విద్యార్థులు, పూర్వ ఆచార్యులు, ప్రధానాచార్యులు, ఆచార్య బృందం, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు. భక్తిశ్రద్ధలతో నిర్వహించిన సామూహిక వరలక్ష్మీ వ్రతం విజయవంతంగా ముగియడంతో పాఠశాల ప్రాంగణంలో ఆధ్యాత్మిక వాతావరణం నెలకొంది.



### దోమలు పుట్టకుండా ఉండాలంటే

# డ్రై డే ఉత్తమ మార్గం

### - జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ అధికారి డా. నరేందర్ రాథోడ్

**హాజీపూర్, ఆగస్టు 21, ప్రభాతవార్త**



మండలంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రం, దొనబండ ఆయుష్మాన్ ఆరోగ్య కేంద్రాలను శుక్రవారం రోజు జిల్లా వైద్య మరియు ఆరోగ్య శాఖ అధికారి డా. నరేందర్ రాథోడ్ ఆకస్మికంగా సందర్శించారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో బయట రోగులకు సేవలు అందిస్తున్న డాక్టర్ సుధాకర్, విధులు నిర్వహిస్తున్న స్టాఫ్ నర్సులతో మాట్లాడారు. అసంక్రమిక వ్యాధుల సేవలను పోర్టల్‌లో ఎప్పటికప్పుడు నమోదు చేయాలని వారు సూచించారు. 100 శాతం స్క్రీనింగ్ పూర్తి చేసి వాటిని ఎప్పటికప్పుడు ఫాలోఅప్ చేయాల్సిందిగా ఆదేశించారు. అనంతరం వారు దొనబండ ఆయుష్మాన్ ఆరోగ్య మందిర్ సందర్శించారు. అక్కడ క్షేత్రస్థాయి సిబ్బంది నిర్వహిస్తున్న డ్రై డే చర్యలను ఆయన పరిశీలించారు. డ్రై డే రోజు ఆశా కార్యకర్తలు ప్రతి ఇల్లు ఆ ఇంటి పరిసరాలు నిశిత దృష్టితో పరిశీలించాలని, దోమల ఉత్పత్తి స్థానాలను గుర్తించి ఇంటి యజమానులకు వాటిని గూర్చి వివరించాలని తెలిపారు. కొన్ని ఇండ్లు వారు సందర్శించి ఇంటిలో ఉన్న వారితో మాట్లాడారు. డెంగ్యూ, చికెన్ గున్యా, మలేరియా బోదకాలు, మెదడు వాపు వ్యాధి కారణమయ్యే దోమలను గూర్చి వారు వివరించారు. కూలర్లు, కొబ్బరి బోండాలు, పాత టైర్లు, పూల కుండీలు, వాడకుండా వదిలేసిన రోలు తదితర కంటేనర్లలో నీరు నిల్వ ఉండి అవే వేల సంఖ్యలో దోమల ఉత్పత్తికి కారణభూతమవుతాయని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో వారితో పాటు డెమో బుక్క వెంకటేశ్వర్లు, హెల్త్ ఎడ్యుకేటర్ అల్లాడి శ్రీనివాస్, ఆరోగ్య పర్యవేక్షకురాలు పద్మ, సీసీ వెంకట్ సాయి, ఏఎన్ఎం పర్వీన్ లల్లి, ఆశా కార్యకర్తలు సత్యవతి, రజిత తదితరులు పాల్గొన్నారు.

## నేడు సామాజిక తనిఖీపై ప్రజావేదిక

**పెంచికల్ పేట్, ఆగస్ట్ 21, ప్రభాతవార్త :**

మండల కేంద్రంలోని రైతు వేదికలో నేడు ఉదయం 11 గంటలకు మండల స్థాయి సామాజిక తనిఖీ ప్రజావేదిక నిర్వహించనున్నట్లు ఏపీవో సతీష్ ఒక ప్రకటనలో తెలిపారు. ఉపాధిహామీ పథకం కింద చేపట్టిన పనులు, ఖర్చులు, కూలీలకు చెల్లింపులు తదితర అంశాలపై సామాజిక తనిఖీలో భాగంగా వివరాలను వెల్లడించనున్నట్లు పేర్కొన్నారు. అధికారులు, ప్రజాప్రతినిధులు, కూలీలు, గ్రామస్తులు హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని అన్నారు.

## నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

**కెరమెరి, ఆగస్టు 21 ప్రభాతవార్త:**

మండలము కెరమెరి సబ్ స్టేషన్ పరిధిలో శనివారం విద్యుత్ విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందని ఆ శాఖ ఈ రమేష్ ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 10:00 గంటల నుండి మధ్యాహ్నం 1:00 గంటల వరకు మూడు గంటల సేపు 33 కె.వి కెరమెరి ఫీడర్ మరమ్మతుల కారణంగా విద్యుత్తు సరఫరా నిలిపివేయబడుతుందన్నారు. కావున విద్యుత్ వినియోగదారులందరు సహకరించగలరు.



## వ్యవసాయంలో సాంకేతిక పరిజ్ఞానం, యాప్‌ల వినియోగంపై రైతులకు శిక్షణ

**బెల్లంపల్లి, ఆగస్టు 21, ప్రభాతవార్త**

ఆత్మ ఆధ్వర్యంలో బెల్లంపల్లి కన్నాల రైతు వేదికలో వ్యవసాయ శాఖ నిర్వహించిన శిక్షణ కార్యక్రమంలో రైతులకు వ్యవసాయంలో సాంకేతిక పరిజ్ఞానం, వివిధ మొబైల్ యాప్‌ల వినియోగంపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఆత్మ చైర్మన్ రౌతు సత్తయ్య మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు రైతుల శ్రేయస్సు కోసం అనేక పథకాలు, శిక్షణ కార్యక్రమాలు చేపడుతున్నాయని తెలిపారు. రైతులు వ్యవసాయ, అనుబంధ శాఖల అధికారులు అందించే సలహాలు, సూచనలు పాటిస్తూ పెట్టుబడి వ్యయాన్ని తగ్గించుకుని అధిక దిగుబడులు సాధించి ఆర్థిక సుస్థిరత పొందాలని సూచించారు. కాసిపేట వ్యవసాయ అధికారి సీహెచ్. ప్రభాకర్ నూతన ఎరువుల బుకింగ్ యాప్ ఎఫ్ఎఫ్ఎస్ గురించి రైతులకు వివరించారు. బెల్లంపల్లి మండల వ్యవసాయ అధికారి ప్రేమ్ కుమార్ వాతావరణ సమాచారం తెలుసుకునే యాప్‌లు, చీడపీడలను గుర్తించే యాప్‌ల వినియోగంపై అవగాహన కల్పించారు. బెల్లంపల్లి ఏడీఏ రాజా నరేందర్ మాట్లాడుతూ రైతులు వ్యవసాయానికి సంబంధించిన యాప్‌లను తమ మొబైల్ ఫోన్లలో ఇన్‌స్టాల్ చేసుకుని మార్కెటింగ్ వివరాలు, వాతావరణ పరిస్థితులు, వర్షపాతం సూచనలు తదితర సమగ్ర వ్యవసాయ సమాచారాన్ని ఎప్పటికప్పుడు తెలుసుకోవాలని సూచించారు. ఆ సమాచారానికి అనుగుణంగా వ్యవసాయ పనులను ప్రణాళికాబద్ధంగా నిర్వహించుకోవాలని తెలిపారు. అనంతరం పీఏసీఎస్ చైర్మన్ చింతం స్వామి మాట్లాడుతూ రైతుల కోసం రాష్ట్ర ప్రభుత్వం నిరంతరం కొత్త కార్యక్రమాలు చేపడుతోందని అన్నారు. ఎరువుల కోసం రైతులు క్యూలైన్లలో నిలబడే ఇబ్బందులను తగ్గించేందుకు యూరియా బుకింగ్ యాప్‌ను అందుబాటులోకి తీసుకువచ్చిందని తెలిపారు. ఈ యాప్ ద్వారా ఇప్పటికే అనేక మంది రైతులు లబ్ధి పొందారని పేర్కొన్నారు. దీనిని ప్రశంసించిన కేంద్ర ప్రభుత్వం దేశవ్యాప్తంగా ఎఫ్ఎఫ్ఎస్ యాప్‌ను తీసుకువచ్చిందని, ఇప్పటికే కొన్ని జిల్లాల్లో రైతులు దీనిని వినియోగిస్తున్నారని చెప్పారు. త్వరలో మంచిర్యాల జిల్లాలో కూడా కొత్త ఎఫ్ఎఫ్ఎస్ యాప్ అందుబాటులోకి రానున్నందున రైతులందరూ సిద్ధంగా ఉండాలని సూచించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు రాజన్న, రైతు సంఘం అధ్యక్షుడు సింగతి రవి, కన్నాల గ్రామ సర్పంచ్ న్యాతరి మల్లమ్మ, ఉపసర్పంచ్ తోకల సూరమ్మ, ఏఈఓ సీహెచ్. తిరుపతి, ఏఈఓ గౌసియా, ఆత్మ డైరెక్టర్లు, రైతులు పాల్గొన్నారు.



## జిల్లా స్థాయి యోగా పోటీలకు రంగం సిద్ధం

### - కళాత్మక, లయబద్ధ, సంప్రదాయ విభాగాల్లో పోటీలు..

### ఈనెల 23న ట్రినిటీ ఉన్నత పాఠశాలలో నిర్వహణ

**మంచిర్యాల,ఆగస్టు 21, ప్రభాతవార్త:**

తెలంగాణ యోగాసన క్రీడల ఆధ్వర్యంలో జిల్లా స్థాయి యోగా పోటీలను ఈనెల 23వ తేదీ ఆదివారం మంచిర్యాల పట్టణంలోని ట్రినిటీ ఉన్నత పాఠశాలలో నిర్వహించనున్నట్లు పాఠశాల ప్రధానోపాధ్యాయులు జాన్ థామస్, యోగాసన క్రీడల అధ్యక్షుడు అక్కల తిరుపతివర్మ, కార్యదర్శి మంద శ్రీనివాస్ తెలిపారు. ఈ పోటీల్లో కళాత్మక, లయబద్ధ, సంప్రదాయ విభాగాల్లో యోగాసన పోటీలు నిర్వహించనున్నట్లు వారు వెల్లడించారు. జిల్లా వ్యాప్తంగా యోగా క్రీడాకారులు పెద్ద సంఖ్యలో పాల్గొని తమ ప్రతిభను ప్రదర్శించాలని నిర్వాహకులు కోరారు. పోటీలను విజయవంతం చేసేందుకు అవసరమైన ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలిపారు.




## ఎస్ఐఆర్ రెండవ దశలో కార్యకర్తలు కీలకంగా పని చేయాలి

### - బిజెపి జిల్లా అధ్యక్షుడు నగునూరి వెంకటేశ్వర గౌడ్

**చెన్నూరు, ఆగస్టు 21, ప్రభాతవార్త**

చెన్నూరు నియోజకవర్గం లో దాదాపు 30 వేల ఓటర్లకు రెండవ దశలో నోటీసులు అందనున్నాయని, నోటీసులు అందిన ప్రతి ఒక్కరికి అండగా ఉండి సరైన సమాధానం చేర్చే విధంగా భారతీయ జనతా పార్టీ కార్యకర్తలు కృషి చేయాలని, ఆ పార్టీ జిల్లా అధ్యక్షులు నగునూరి వెంకటేశ్వర గౌడ్ అన్నారు. చెన్నూరు మండలంలోని కిష్టంపేట గ్రామంలోని బిఎంఆర్ గార్డెన్ లో ఏర్పాటుచేసిన రెండో దశ ఎస్ఐఆర్ వర్క్‌షాప్‌లో రాష్ట్ర ఎస్ఐఆర్ కన్వీనర్ ఆంథోనీ రెడ్డితో కలిసి ఆయన మాట్లాడారు. కొత్త ఓటర్లు ఫామ్ సిక్స్ అదేవిధంగా ఓటు షిఫ్టింగ్ చేసుకునేవారు ఫాం 8 అభ్యంతరాలకు ఫామ్ 7 సబ్మిట్ చేయాలని కార్యకర్తలకు వివరించారు. రెండవ దశ ఎస్ఐఆర్ పూర్తి చేసి తుది జాబితా విడుదల అయ్యేంతవరకు బిఎల్ఎలు నిరంతరం అప్రమత్తంగా ఉండాలనీ సూచించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ఎస్ఐఆర్ కన్వీనర్ ఆంతోనీ రెడ్డి, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు దుర్గం అశోక్, జిల్లా ప్రధాన కార్యదర్శి ఎనకందుల కృష్ణమూర్తి, బిఎల్ఎ వనజా, తిరుపతి, జిల్లా కార్యదర్శి వైద్య శ్రీధర్, మండల పార్టీ అధ్యక్షులు బుర్ర రాజశేఖర్ గౌడ్, బోర్ కుట్టి శంకర్, ఠాకూర్, ధన్ సింగ్, సప్పిడి నరేష్ తదితరులు పాల్గొన్నారు.

## వర్షాకాలంలో విద్యుత్ ప్రమాదాల నివారణపై రైతులకు అవగాహన

### - డీఈ వెంకటేశ్వర్లు

**సారంగాపూర్, ఆగస్టు 21, ప్రభాతవార్త:**

మండలంలోని యాకర్పల్లి గ్రామ పంచాయతీ కార్యాలయంలో టీజీ ఎన్పీడీసీఎల్ ఆధ్వర్యంలో విద్యుత్ భద్రతపై శుక్రవారం ప్రత్యేక అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సదస్సుకు విద్యుత్ శాఖ డీఈ వెంకటేశ్వర్లు ముఖ్య అతిథిగా హాజరై రైతులకు, గ్రామస్తులకు విద్యుత్ ప్రమాదాల నివారణపై పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా డీఈ వెంకటేశ్వర్లు మాట్లాడుతూ వర్షాకాలంలో విద్యుత్ ప్రమాదాలు జరిగే అవకాశం ఎక్కువగా ఉన్నందున రైతులు తీవ్ర అప్రమత్తంగా ఉండాలని కోరారు. పొలాల వద్ద పంటల రక్షణకు ఇనుప తీగలు వాడకుండా కేవలం నైలాన్ తాళ్లను మాత్రమే ఉపయోగించాలని సూచించారు. విద్యుత్ స్తంభాలు, ట్రాన్స్‌ఫార్మర్లు, సర్వీస్ వైర్లను తాకవద్దని, సాంకేతిక సమస్యలు లేదా మరమ్మతులు ఉంటే 1912 టోల్ ఫ్రీ నంబర్‌కు సమాచారం అందించాలని స్పష్టం చేశారు. అనంతరం రైతులకు విద్యుత్ భద్రత అవగాహన కరపత్రాలతో పాటు ఉచితంగా నైలాన్ తాళ్లను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఏఈ సాయి కిరణ్, యాకర్పల్లి సర్పంచ్ దివ్య నవీన్, విద్యుత్ శాఖ సిబ్బంది, స్థానిక రైతులు పాల్గొన్నారు.

## పంటల వ్యవస్థపై రైతులకు శిక్షణ

### - పంటమార్పిడి, సస్యరక్షణ చర్యలతో అధిక దిగుబడి

### - రైతులకు సూచించిన చెన్నూరు ఏడీఏ బానోత్ ప్రసాద్

**చెన్నూరు, ఆగస్ట్ 21, ప్రభాతవార్త**



రైతులు పంట దిగుబడి సాధించాలంటే పంట మార్పిడి, పంటలకు సస్యరక్షణ చర్యలు చేపట్టాలని చెన్నూరు ఏడీఏ బానోత్ ప్రసాద్ రైతులకు సూచించారు. మంచిర్యాల జిల్లా చెన్నూరు మండలం బుద్ధారం గ్రామంలో వ్యవసాయ శాఖ అధ్వర్యంలో పంటల వ్యవస్థపై రైతులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏడీఏ ప్రసాద్ మాట్లాడుతూ అధిక దిగుబడి, ఆదాయం రావాలంటే పంటల మార్పిడి విధానం, నేల ఆరోగ్యం సస్యరక్షణ చర్యల ద్వారానే అది సాధించవచ్చని తెలిపారు. తక్కువ పెట్టుబడితో అధిక దిగుబడి సాధించే పద్ధతులపై రైతులకు అవగాహన కల్పించారు. వివిధ రకాల పంటలను సాగు చేయడం ద్వారా నేల సారాన్ని కాపాడుకోవడంతో పాటు, రైతులకు అదనపు ఆదాయం వస్తుందన్నారు. పంటల ఎంపిక, విత్తనాల వినియోగం, ఎరువుల యాజమాన్యం, నీటి పొదుపు తదితర అంశాలపై సూచనలు చేశారు. పంటలపై తెగుళ్లు, పురుగుల బారి నుంచి కాపాడేందుకు రైతులు సస్యరక్షణ చర్యలు చేపట్టాలన్నారు. పంట పొలాలను క్రమం తప్పకుండా పరిశీలిస్తూ పురుగులు, తెగుళ్ల లక్షణాలను తొలిదశలోనే గుర్తించాలని అన్నారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారిని యామిని, విస్తనా అధికారి సాయికృష్ణ, రైతులు పాల్గొన్నారు.